సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన

పీఎం సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్ 2047 లక్ష్య సాధనకు అందరం కృషి చేద్దామని జయ పిలుపునిచ్చారు. 8లో



మార్గశిర రాట మహోత్సవం

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల రాట కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. 8లో



తహశీల్దార్ కార్యాలయాలు..

జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఆధునీకీకరణ పనులు వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ప్రాక్టికల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ



ప్రాక్టికల్స్ తరగతులను పరిశీలిస్తున్న ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ విద్యా క్యాలెండర్ అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో తప్పనిసరిగా విద్యార్థులతో ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ అన్నారు. గురువారం విశాఖ నగరంలోని ఫిట్జీ జూనియర్ కాలేజీని ఆయన తనిఖీ చేశారు. కాలేజీలో సైన్సు విద్యార్థులకు నిర్వహిస్తాన్న ప్రాక్టికల్స్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. చదువులపై దృష్టి సారించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాలేజీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహించకుంటే కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు టాస్క్‌ఫోర్స్ సమావేశం

విశాఖ విద్య: పాఠశాల విద్యార్థుల భద్రతపై పటిష్టమైన చర్యలు చేపట్టేలా జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. విద్య, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక, విపత్తుల నివారణ శాఖలు ఈ సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. డాబాగార్డెన్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2గంటలకు సమావేశం ఉంటుందన్నారు. దీనికి జిల్లాలోని అన్ని ప్రైవేటు స్కూళ్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

సింహగిరిపై తిరునక్షత్ర పూజలు ప్రారంభం



తిరునక్షత్ర పూజలు నిర్వహిస్తున్న స్థానాచార్యులు, వైదికులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి మనవాళ్ మహామునులు తిరుక్షత్ర పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణం పఠించారు. విశేషంగా హారతులు సమర్పించారు. ఆలయ స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

డాబాగార్డెన్స్: డయల్ యువర్ డీపీటీవో (జిల్లా ప్రజా రవాణా అధికారి) కార్యక్రమం ఈ నెల 24న నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం ఉంటుందని, ప్రయాణికులు 995922582 నంబర్‌కు డయల్ చేసి సమస్య తెలపవచ్చు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు వినియోగించుకొని సలహాలు, సూచనలు తెలపవచ్చన్నారు.

35 స్కూల్ ఆటోలపై కేసులు



ఎన్‌ఏడీ వద్ద ఆటోలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది

గోపాలపట్నం: స్కూల్ ఆటోలు నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. స్కూల్ విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోలు నిబంధనలు పాటించకపోతే కఠినంగా వ్యవహరిస్తామని రవాణా శాఖ ఉప కమిషనర్ రాజారత్నం హెచ్చరించారు. గురువారం నగరంలో ఎన్‌ఏడీ, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. 35 ఆటోలపై కేసులు నమోదు చేశారు. మరో 8 ఆటోలను సీజ్ చేశారు. ఆటోలో ఆరుగురికి మాత్రమే ప్రయాణించాలని, అంతకంటే ఎక్కువ మంది ఉంటే చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో ఆర్‌టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, మోటారు వాహన తనిఖీ అధికారులు హరి ప్రసాద్, రోఖీ మున్నీషా, ప్రవీణ్ కుమార్, రాజారావు, మాధవి, లలిత పాల్గొన్నారు.

సంద్రమంత సంబరం



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, జేసీ విశ్వనాథన్

- ఊహించిన దానికన్నా మిన్నగా పరిహారం
- మూడు రోజుల్లోనే చెక్కులు అందజేత
- ఒక్కొక్కరికి రూ.2.40 నుంచి రూ.32.80 లక్షల పంపిణీ
- బాధిత మత్స్యకారుల్లో వెల్లివిరిసిన ఆనందం

సాక్షి, విశాఖపట్నం: నిన్న మొన్నటి వరకు వారి కళ్లల్లో నీళ్ల సుడులు తిరుగుతూ కనిపించాయి. తమ బతుకులు ఏమవుతాయోనని వారి ముఖాల్లో భయాందోళనలు గోచరించాయి. కూడు బెట్టే నావలు బుగ్గి పాలయ్యాయంటూ వేదన చెందారు. గత ప్రభుత్వాల నిర్వాకాన్ని గుర్తుకు తెచ్చుకుని ఇక తమకు అథోగతేనంటూ రేయింబవళ్లు రోదించారు. పట్టించుకునే వారే ఉండరని కుమిలిపోయారు. అయితే ఆవేదన, ఆందోళన కేవలం మూడు రోజులకే ముగిసిపోయింది. వాటి స్థానంలో సంతోషం వెల్లువెత్తింది. ఊహించని విధంగా సర్కారు ఆదుకుంది. ఊహకు మించి సాయాన్ని అందించింది. బాధిత మత్స్యకారుల కళ్లల్లోనూ, ఇళ్లల్లోనూ సంద్రమంత సంబరాన్ని నింపింది.

గత ఆదివారం అర్ధరాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు ఆహుతయ్యాయి. వీటిలో 30 పూర్తిగా, 19 పాక్షికంగా దగ్ధమయ్యాయి. దీంతో వీటి యజమానులే కాదు.. బోట్లపైనే ఆధారపడి బతుకీడుస్తున్న మత్స్యకార కలాసీలు కూడా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలో హుద్‌హుద్, తిత్లీ, పెథాయ్ వంటి తుపానులకు దెబ్బతిన్న బోట్లకు పరిహారం చెల్లిస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏళ్లు గడిచినా ఆ హామీకి అతీగతీ లేకుండా పోయింది. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, ఆదాయం వచ్చే మార్గం లేక బాధిత మత్స్యకార కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఆదివారం నాటి అగ్ని ప్రమాద బాధితులు వీరిని గుర్తుకు తెచ్చుకుని తమకూ అలాంటి పరిస్థితే ఎదురవుతుందని, తమను ఎవరూ ఆదుకోరని ఆందోళన వ్యక్తమైంది. అయితే వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్య నిర్ణయాన్ని తీసుకున్నారు. బోట్లకు వాటిల్లిన నష్టంలో 80 శాతం సొమ్మును పరిహారంగా ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించారు. అందుకు ఎంతో సమయం పడుతుందని బాధిత మత్స్యకారులు భావించారు. కానీ వెనువెంటనే నష్టాన్ని అంచనా వేయించడం, ఆపై నిధులు విడుదల కావడం, ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే ఈ 49 మందికి రూ.7.11 కోట్ల చెల్లింపులు చకచకా జరిగిపోయాయి. ఊహించని ఈ పరిణామానికి మత్స్యకారులు ఆశ్చర్యానికి గురయ్యారు. సీఎం వైఎస్ జగన్ తమను ఇంత వేగంగా ఆదుకుంటారని కలలో సైతం ఊహించలేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలా పూర్తిగా దగ్ధమైన బోటుకు గరిష్టంగా రూ.32.80 లక్షలు, పాక్షికంగా కాలిపోయిన బోటుకు కనిష్టంగా రూ.2.40 లక్షలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. వీరికే కాదు ఈ బోట్లపై ఆధారపడి జీవిస్తున్న మరో 400 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెల్లించి బాధితుల కళ్లల్లో వెలుగులు నింపారు. సీఎం జగన్‌కు తామెప్పుడూ రుణపడి ఉంటామని వారు తమ సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

మొత్తం 49 మందికి పరిహారం :	రూ.7.11 కోట్లు
బోటుకు గరిష్టంగా :	రూ.32.80 లక్షలు
పాక్షికంగా దగ్ధమైన బోటుకు కనిష్టంగా :	రూ.2.40 లక్షలు
మరో 400 మందికి (ఒక్కొక్కరికి) :	రూ.10 వేలు

కలలోనూ ఊహించలేదు..



అగ్ని ప్రమాదంలో నా బోటు పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం సాయం చేస్తుందని చెప్పినా నమ్మలేదు. ఎంతోకొంత ఇచ్చి చేతులు దులుపుకుంటుందనుకున్నాను. కానీ రూ.24.80 లక్షల పరిహారం ఇచ్చింది. ఇంత సొమ్ము వస్తుందని కలలోనూ ఊహించలేదు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంతలా సాయమందించలేదు. ఈ సొమ్ముతో కొత్త బోటు కొనుక్కుని యథావిధిగా వేట సాగిస్తా.

– వంకా గురుమూర్తి, బోటు యజమాని, అన్నవరం, భీమిలి మండలం.

ఊహకు మించిన పరిహారం



పూర్తిగా దగ్ధమైన నా బోటుకు రూ.15–16 లక్షల పరిహారం వస్తుందనుకున్నాను. కానీ ఊహకు మించి రూ.20.80 లక్షలు వచ్చింది. ఈ ప్రభుత్వం మమ్మల్ని చాలా బాగా ఆదుకుంది. చాలా సంతోషంగా ఉంది. మత్స్యకారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పుడూ మరచిపోరు.

– మైలపిల్లి చిన్నయ్య, బోటు యజమాని, అన్నవరం.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



రూ.లక్షలు అప్పు చేసి బోటు కొనుక్కున్నాం. అప్పు తీరకుండానే బోటు కాలిపోయింది. ఎలా బతకాలోనని తిండీతిప్పలు మాని ఏడుస్తూ గడిపాం. సీఎం జగన్‌బాబు మా బోటుకు రూ.22.40 లక్షల పరిహారం ఇచ్చి మా కష్టాన్ని తీర్చాడు. ఆయనకు రుణపడి ఉంటాం.

– అర్జిల్లి అమ్మోరమ్మ, చేపల కంచేరు, విజయనగరం జిల్లా.

సత్వరమే చెల్లిస్తారనుకోలేదు



బోటు కాలిపోయినప్పుడు మా బతుకులు ఏంటని ఇంటిల్లపాదీ ఏడ్చాం. ఇంత వేగంగా, పెద్ద మొత్తంలో పరిహారం చెల్లిస్తారనుకోలేదు. పూర్తిగా కాలిపోయిన నా బోటుకు రూ.16.80 లక్షలు ఇచ్చారు. కష్టాలు ఎరిగిన నేత వైఎస్ జగన్. మళ్లీ ఆయనే సీఎం కావాలి.

– బొద్దు ఎల్లాజీ, కోనాడ, విజయనగరం జిల్లా.

గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా స్పందించలేదు



తిత్లీ తుపానులో రూ.30 లక్షల విలువైన నా బోటు పూర్తిగా దెబ్బతింది. అప్పటి ప్రభుత్వం రూ.6 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పింది. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మా అన్నయ్య ఎరికోడు బోటు కాలిపోతే ఇప్పుడు రూ.7 లక్షల పరిహారం ఇచ్చారు.

– గనగళ్ల మహేష్, ముక్కాం, భోగాపురం మండలం.

మూడు రోజుల్లోనే పరిహారం



విశాఖ హార్బర్‌లో రూ.40 లక్షలు చేసే నా బోటు పెథాయ్ (2018లో) తుపానుకు మునిగిపోయింది. ఆరు నెలల్లోనే పరిహారం ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఎంత తిరిగినా సాయం అందలేదు. హార్బర్‌లో కాలిపోయిన బోట్లకు జగన్ ప్రభుత్వం మూడు రోజుల్లోనే భారీ పరిహారాన్ని ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– అల్లిపిల్లి సత్యవతి, భీమిలి అన్నవరం

కల్యాణ మస్తు, షాదీతోఫా పేదలకు వరం

- నాలుగో విడత వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పంపిణీ
- జిల్లాలో 255 మంది లబ్ధిదారులకు రూ.1.57 కోట్లు అందజేత



లబ్ధిదారులకు మెగా చెక్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా ద్వారా వారి తల్లుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమచేస్తున్నామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించి, బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూలై – సెప్టెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న 255 మంది లబ్ధిదారులకు కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా రూ.1.57 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు సీఎంకి వివరించారు. ఇందులో 65 బీసీ–ఏ జంటలకు రూ.34 లక్షలు, 49 బీసీ–బి జంటలకు రూ.24.25 లక్షలు, 89 బీసీ–డీ జంటలకు రూ.46.25 లక్షలు, 8 బీసీ–ఈ జంటలకు రూ.4.50 లక్షలు, 36 ఎస్సీ జంటలకు రూ.38.20 లక్షలు, 2 ఎస్టీ జంటలకు రూ.2.40 లక్షలు, ఒక భవన నిర్మాణ కార్మికుల జంటకు 40 వేలు, 5 దివ్యాంగ జంటలకు రూ.7.50 లక్షలు మంజూరు చేశామన్నారు. బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువు తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారని తెలిపారు. సామాజిక మార్పులో ఇది ఒక విశిష్టమైన పాత్రను పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నగరాలు సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ పి.సుజాత సత్య నారాయణ, రాష్ట్ర యాత సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ సుజాత నూకరాజు, రాష్ట్ర కాళింగ సంక్షేమాభివృద్ధి సంస్థ డైరెక్టర్ బి.పద్మావతి, మహిళా శిశు సంక్షేమాభివృద్ధి ఉత్తరాంధ్ర రీజియన్ చైర్‌పర్సన్ ఎం.మాధవి వర్మ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పి.చిన్నతల్లి పెంటారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్.శోభారాణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్.జ్యోతిమాధవి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇంచార్జ్ పూర్ణిమదేవి, అధికారులు, వధూవరులు తదితరులు పాల్గొన్నారు.

'జోష్' నింపిన సూర్య



సెంచరీతో చెలరేగిన జోష్



సూర్యకుమార్ యాదవ్ మెరుపులు

విశాఖ తీరాన అభిమాన తరంగం టీ 20 మ్యాచ్ సందర్భంగా హోరెత్తింది. ఆ ఉరవళ్లు ఈ కార్తీకాన సందడి చేశాయి. డియర్ టీం ఇండియా.. మేమంతా మీ వెంటే.. మళ్లీ చెబుతున్నాం అభిమాన సంద్రం ఎన్నడూ చిన్నబోదు.. అని స్పష్టం చేసింది. నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లో మన కుర్రాళ్లు కుమ్మేశారు. అటు ఆసీస్.. ఇటు భారత్ ఆటగాళ్లు పరుగుల వరద పారించడంతో క్రికెట్ అభిమానులు పండగ చేసుకున్నారు. ఆసీస్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ కేవలం 50 బంతుల్లో 110 పరుగులు చేయగా.. అందుకు దీటుగా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 42 బంతుల్లో 80 పరుగులు చేసి ఇండియా విజయానికి బాటలు వేశాడు. ఇండియా–ఆస్ట్రేలియా టీ–20 సిరీస్‌లో తొలి మ్యాచ్ విశాఖ క్రీడాభిమానులకు మంచి కిక్ ఇచ్చింది. 8లో



అభిమానుల ఉత్సాహం







సత్యసాయి మార్గం అనుసరణీయం

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



దాత సత్యవతితో కలిసి బాలికల విభాగాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

పెందుర్తి: భగవాన్ సత్యసాయి బాబా సేవా మార్గం ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలోని భగవాన్ సత్యసాయి ఆరాధన హోమ్‌లో దాత, సత్యసాయి భక్తురాలు లోవ సత్యవతి సమకూర్చిన రూ.20 లక్షల నిధులతో బాలికల విభాగం భవనాన్ని నిర్మించారు. సత్యసాయి జన్మదినోత్సవం సందర్భంగా ఆ భవనాన్ని గురువారం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. అనాథ పిల్లల కోసం తన ఆస్తిలోని కొంత మొత్తాన్ని భవన నిర్మాణానికి వినియోగించిన సత్యవతి సేవలు హర్షణీయమన్నారు. అనంతరం దాత సత్యవతిని ఘనంగా సత్కరించారు. దాదాపు 400 మంది నిరుపేదలకు ముత్యాలనాయుడు చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు, సింహాచలం సమితి కన్వీనర్ చప్ప అక్కునాయుడు, వేపగుంట భజన మండల కన్వీనర్ మల్లా జగదీష్, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, ఆరాధన హోం నిర్వాహకులు విశ్వసాయి గురూజీ, ప్రియ బాంధవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పరిశీలన



సూచనలు చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతుల కోసం సింహాచలంలోని శ్రీదేవి కాంప్లెక్స్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన దరఖాస్తులు జారీ , స్వీకరణ కేంద్రాన్ని గురువారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పరిశీలించారు. కేంద్రాన్ని బుధవారమే ఏర్పాటు చేయగా దేవదాయశాఖ ఉన్నతాధికారుల పిలుపు మేరకు ఈవో అమరావతి మీటింగ్‌కి వెళ్లడంతో అందుబాటులో లేరు. దీంతో గురువారం ఈవో కేంద్రానికి వచ్చి దరఖాస్తుల జారీ , స్వీకరణ ప్రక్రియలను పరిశీలించారు. పది నుంచి ఇరవై రోజుల్లో దరఖాస్తు దారులకు వారి దరఖాస్తు స్టేటస్ తెలుస్తుందని తెలియజేశారు. కాగా గురువారం 93 దరఖాస్తులు రాగా, 63మంది పూర్తి చేసిన దరఖాస్తులను అందజేశారు.

కేకే లైన్లో డీఆర్‌ఎం తనిఖీలు



కరకవలస స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం కేకే లైన్లో తనిఖీలు చేపట్టారు. ఈ పరిధిలోని పలు స్టేషన్‌లలో ఆయన తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. స్టేషన్‌లో సదుపాయాలు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ మార్గంలో జరుగుతున్న డబ్లింగ్ పనులను పరిశీలించారు. ఈ తనిఖీలలో భద్రత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రయాణికుల సదుపాయాలు స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. శివలింగపురం స్టేషన్‌లో సదుపాయాలు, త్యాడ స్టేషన్‌లో ఆధునికీకరిస్తున్న స్టేషన్ భవనం, ట్రాక్షన్, సబ్ స్టేషన్, యార్డ్ ప్లానింగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం బొర్రాగుహలు, కరకవలస, సిమిలిగుడ స్టేషన్‌లలో కూడా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ఆయనతో పాటు చీఫ్ ఇంజనీర్,కన్‌స్ట్రక్షన్ కె.ధనుంజయరావు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నగరంలో 'మంగళవారం'



మీడియా సమావేశంలో చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు: మంగళవారం చిత్ర యూనిట్ విశాఖలో సందడి చేసింది. ఓ హోటల్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. చిత్ర హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ ఆర్‌ఎక్స్ 100 సినిమా తరువాత ఈ సినిమాకు మంచి పేరు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమా తెరకెక్కిందన్నారు. సినిమాలో శైలజ పాత్ర పోషించేందుకు తొలుత సంకోచించినా తరువాత సాహసోపేతంగా చేశానన్నారు. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ అజయ్ భూపతి మాట్లాడుతూ ఈ చిత్రంలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటోందన్నారు. ఆఖరి 40 నిమిషాలు ఎంతో ఉత్కంఠగా ఉంటుందన్నారు. మంగళవారం చిత్రం పార్ట్ 2 కూడా త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటుడు శ్రీతేజ్, శరవన్ రెడ్డి, నిర్మాత సురేష వర్మ పాల్గొన్నారు.



మువ్వన్నెల దరహాసం



విజయం మనదే..



కమాన్ ఇండియా





మేరా భారత్ మహాన్

కుర్రాళ్లు SUPER HIT







క్యాచ్ పడుతున్న స్టోయినిస్

విశాఖను టీ–20 తుపాను కమ్మేసింది. బ్యాటర్లు వైఎస్సార్ స్టేడియంలో పరుగుల సునామీ సృష్టించారు. సిక్సర్లు, ఫోర్లతో శివతాండవం చేశారు. ముందుగా ఆస్ట్రేలియా బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి.. ఫోర్లు, సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. భారీ లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన భారత కుర్రాళ్లు అనుభవజ్ఞులున్న ఆస్ట్రేలియా జట్టును కంగారు పెట్టించారు. అచ్చొచ్చిన స్టేడియంలో అదరగొట్టారు. నరాలు తెగే ఉత్కంఠ మధ్య భారీ లక్ష్యాన్ని ఛేదించి శభాష్ అనిపించుకున్నారు. వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమితో నిరాశలో ఉన్న అభిమానుల్లో ఈ విజయం జోష్ నింపింది.

– విశాఖ స్పోర్ట్స్

సైడ్‌లైట్స్

- ప్రపంచ కప్ ముగిసిన నాలుగు రోజుల వ్యవధిలోనే విశాఖ వేదికగా ప్రారంభమైన టీ–20 మ్యాచ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.
- ఆట ప్రారంభానికి ముందే అన్నీ గ్యాలరీలన్నీ నిండిపోయాయి.
- అభిమానులు తమ మోములపై త్రివర్ణ రంగులు ముద్రించుకుని.. జెండాలు పట్టుకుని దేశభక్తిని ప్రదర్శించారు. సెల్‌ఫోన్ ఫ్లాష్‌లైట్లతో క్రీడాకారులను ఉత్సాహ పరిచారు.
- స్పిన్నర్‌గా కెరీర్ ప్రారంభించిన స్మిత్ ఏకంగా ఓపెనర్‌గా రూపాంతరం చెంది తొలి బంతిని ఆడాడు.
- కెప్టెన్‌గా సూర్యకుమార్, కోచ్‌గా లక్ష్మణ్‌కు ఇదే తొలి మ్యాచ్. ఆట విరామ సమయంలో వీరిద్దరూ జట్టు సభ్యులకు పలు సూచనలిచ్చారు.
- టీ–20ల్లో కనీసం అర్ధ సెంచరీ కూడా లేని ఇంగ్లిష్ ఏకంగా 47 బంతుల్లోనే సెంచరీ చేశాడు.
- గెలిచినా ఓడినా క్రికెట్ ఫర్ ఎవర్ అంటూ పెద్ద ఎత్తున అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు.



క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు





స్టేడియం వెలుపల అభిమానులు



ఆస్ట్రేలియా అభిమానుల సందడి

అప్పన్న సన్నిధిలో భారత క్రికెటర్లు



తిలక్‌వర్మ, వాషింగ్టన్ సుందర్‌లను శాలువాలు కప్పి సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం భారత క్రికెటర్లు తిలక్‌వర్మ, వాషింగ్టన్ సుందర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. వారి పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు. పీఆర్వో నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఇషాన్ కిషాన్



రింకూ సింగ్ విన్నింగ్ షాట్

2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన

- రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ప్రశంసనీయం
- గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి జయ

కొమ్మాది: ప్రధానమంత్రి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ 2047 లక్ష్య సాధనకు అందరం కృషి చేద్దామని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఆర్.జయ పిలుపునిచ్చారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ మిషన్ భవన్‌లో గురువారం జరిగిన గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో ఆమె మాట్లాడారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన.. అవగాహన, కౌన్సెలింగ్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఎనీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి ఒకటి కాదన్నారు. సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. గిరిజన ఆరోగ్యం, మౌలిక వసతి కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాకారులతో కలిసి ఆమె థింసా నృత్యం చేశారు. గిరిజన కళాకారుల జానపద నృత్యాలు, హస్తకళలు, గిరిజన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.వి.మురళి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.



గిరి మహిళలతో కలసి థింసా నృత్యం చేస్తున్న అదనపు కార్యదర్శి జయ

ఉత్సాహంగా గిరిజన ఉత్సవాలు

బీచ్‌రోడ్డు: గిరిజన స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గిరిజన స్వాభిమాన ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గిరిజన సాంస్కృతిక పరిశోధన కేంద్రం ఈడీ చిన్నబాబు బెలూన్లు విడిచి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ నెల 26వ తేదీ వరకు సాగే ఈ ఉత్సవాల్లో గిరిజన కళాకారుల నృత్య, సంగీత ప్రదర్శన, గిరిజన విద్యార్థులతో వెస్ట్రన్ డ్యాన్స్‌ల ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గిరిజన స్టాళ్లు సందర్శకులను అలరించాయి. ఎదురు కర్రలతో రూపొందించిన వస్తువులు, మట్టి పాత్రలు ఆకట్టుకున్నాయి. బొంగులో చికెన్, బొంగులో బిర్యానీ రుచిని ఆస్వాదించారు.

తహసీల్దార్ కార్యాలయాల ఆధునికీకరణ వేగవంతం


పెందుర్తి: జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఆధునికీకరణ పనులు వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఇటీవల ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకున్న పెందుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల కిందట జిల్లాలోని ప్రతీ తహసీల్దార్ కార్యాలయం ఆధునికీకరణకు రూ.5 లక్షలు కేటాయించామన్నారు. వాటితో పాటు స్థానికంగా ఉండే దాతల సహకారంతో ఆయా కార్యాలయాల పనులు చేపడుతున్నామని చెప్పారు. వేగంగా కార్యాలయ ఆధునికీకరణ పనులు పూర్తి చేసిన పెందుర్తి తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, సిబ్బందిని అభినందించారు. ఇప్పటికే కేజీహెచ్‌నురూ.14కోట్ల సీఎస్సార్ నిధులతో ఆధునీకరించామన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోనూ ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. అనంతరం కార్యాలయంలో వసతులను పరిశీలించారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్, తహసీల్దార్ శ్యాంప్రసాద్, డీటీ రంగలక్ష్మి, ఎంపీపీ మధుపాడ నాగమణి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఎంపీడీవో వసంత, ఎంపీటీసీ దాడి వరలక్ష్మి, సర్పంచ్ ఉగ్గిన గోవింద, నాయకులు ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి పాల్గొన్నారు.



పెందుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఫుట్‌బాల్ విజేతలు అనంతపురం, కడప

తగరపువలస: 67వ ఎస్‌జీఎఫ్ ఏపీ అంతర్ జిల్లాల అండర్–14 ఫుట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో వైఎస్సార్ కడప జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్స్‌గా కర్నూల్, మూడవ స్థానంలో వైఎస్సార్ కడప, బాలుర విభాగంలో రన్నర్స్‌గా అనంతపురం, మూడవ స్థానంలో విశాఖ జట్లు నిలిచాయి. భీమిలి జెడ్పీ బి.రాము విజేతలకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. వీరు త్వరలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నారు. మూడు రోజుల పాటు బాలురకు భీమిలి వుడా మినీ స్టేడియంలో, బాలికలకు సంగివలస వరల్డ్ అమేయా స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి. అమేయా స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, పరిశీలకుడు ప్రభాకర్, వివిధ జిల్లాల ప్రతినిధులు అప్పలరాజు, లలిత్‌కుమార్, చిల్ల వెంకటరెడ్డి, పతివాడ శ్రీనివాసరావు, చిల్ల కైలాసరెడ్డి, నల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు

రైలు కింద పడి నవవధువు ఆత్మహత్య



లావణ్య (ఫైల్)

గోపాలపట్నం: ఏం జరిగింది ఏమో గానీ నూరేళ్ల బంధం నెల రోజులకే ముగిసింది. పుట్టింటికి వెళ్తానని భార్య చెప్పగా.. 10 రోజుల కిందటే వెళ్లి వచ్చావు కదా.. అని భర్త చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత రైలు కింద పడి ఆమె బలవన్మరణానికి పాల్పడింది. సింహాచలం రైల్వేస్టేషన్‌లో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం సమీపం జమదలకు చెందిన పెంట రాంబాబుతో అదే గ్రామానికి చెందిన లావణ్యకు గత నెల 22న వివాహం జరిగింది. రాంబాబు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. పెళ్లికి ముందు రాంబాబు ఆర్అండ్‌బీ జంక్షన్‌లో నివాసం ఉండేవాడు. వివాహం జరిగిన తర్వాత 89వ వార్డు చంద్రానగర్‌లో అద్దె ఇంట్లోకి మారాడు. కాగా.. గురువారం ఉదయం పుట్టింటికి వెళ్తానని ఆమె భర్తను కోరగా.. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మీ అమ్మానాన్న ఇక్కడకు వస్తున్నారు. ఇంటికి వెళ్లొదని రాంబాబు భార్యకు చెప్పి పనికి వెళ్లిపోయాడు. భర్త మాట వినకుండా ఆమె ఇంటి నుంచి బయలుదేరింది. ఈ విషయం తల్లిదండ్రులు సురేష్, పార్వతికి చెప్పింది. వెంటనే వారు రాంబాబుకు ఫోన్ చేసి.. లావణ్య మా ఇంటికి వచ్చేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లిందని చెప్పారు. దీంతో ఆయన సింహాచలం, విశాఖ రైల్వే స్టేషన్లలో వెతికాడు. ఈ క్రమంలో ఆమె సింహాచలం రైల్వేస్టేషన్ నుంచి తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి.. మాట్లాడకుండా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని రాంబాబుకు చెప్పడంతో వెంటనే ఆయన సింహాచలం స్టేషన్‌కు చేరుకుని.. రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. దీపావళికి ఆమె పుట్టింటికి వెళ్లి వచ్చింది. మళ్లీ సొంతూరుకు వెళ్తానని చెప్పడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న జీఆర్పీ పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. వివాహం జరిగిన నెల రోజులకే లావణ్య చనిపోవడంతో ఆమె తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. వీరి రోదన చూసిన వారు కంటతడిపెట్టారు.


శాస్త్రోక్తంగా మార్గశిర రాట మహోత్సవం

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల రాట కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. ఆ సంప్రదాయం ప్రకారం ఉదయం 9.23 గంటలకు నాదస్వర సుస్వారాలు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముహూర్తపు రాట వేసి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. ముందుగా ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులకు అమ్మవారి జాకెట్టు ముక్క, తాంబూలం, గాజులు, ప్రసాదం అందజేశారు. ఇప్పటి నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవ ఏర్పాట్లు విస్తృతం చేయనున్నారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఈవో కె.శిరీష, ధర్మకర్తలు సత్య రూపవాణి, బి.అనురాధ, సుబ్రహ్మణ్యం, సతీష్, ప్రత్యేక ఆహ్వానితుడు జి.ప్రకాష్, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం లారీని ఆటో ఢీకొట్టిన ఘటనకు సంబంధించి డ్రైవర్ రాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా ఆటో నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రాజుపై 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మేంద్ర తెలిపారు. ప్రమాదానికి సంబంధించి సీసీ కెమెరాల్లోని ఫుటేజీ పరిశీలించామని, లారీని గమనించలేదని డ్రైవర్ చెప్పాడని తెలిపారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం రామకృష్ణ

మహారాణిపేట: కేజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. పేగు క్యాన్సర్‌కు శస్త్రచికిత్స చేసుకున్న కెల్లా రామకృష్ణకు ఇన్‌సిషనల్ హెర్నియా అనే అరుదైన వ్యాధి సోకింది. కేజీహెచ్ జనరల్ సర్జరీ ఎస్–5 ఇన్‌చార్జి డాక్టర్ బి.తేజేశ్వరరావు మూడు గంటల పాటు శ్రమించి ఆయనకు శస్త్రచికిత్స చేశారు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న కెల్లా రామకృష్ణకు పేగు క్యాన్సర్ సోకడంతో కొన్నేళ్ల కిందట శస్త్రచికిత్స జరిగింది. ఆ తర్వాత ఆయనకు ఇన్‌సిషనల్ హెర్నియా అనే వ్యాధి సోకింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించారు. ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పడంతో అక్టోబర్ 27న కేజీహెచ్ వైద్యులను సంప్రదించారు. ఎస్5 యూనిట్ చీఫ్ డాక్టర్ బి.తేజశ్వరరావు ఆయన్ని పరీక్షించి.. పలు రకాల స్కాన్‌లు చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 8న డాక్టర్ తేజేశ్వరరావు రామకృష్ణకు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి ఎస్5 వార్డులో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం కుదుటపడటంతో కుట్లు తొలగించామని, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, యూనిట్ చీఫ్ డాక్టర్ తేజేశ్వరరావుకు రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

పవన్ కల్యాణ్ రాక నేడు

తాటిచెట్లపాలెం: ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులను పరామర్శించేందుకు శుక్రవారం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విశాఖ వస్తున్నారని ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని.. ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందిస్తారని తెలిపారు. సమావేశంలో పీతల మూర్తియాదవ్, కందుల నాగరాజు, పసుపులేటి ఉషాకిరణ్, అంగ ప్రశాంత్, గుగ్గలయ్య, నాగలక్ష్మి, అప్పారావు, మూగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.